సాక్షి ఖమ్మం

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



ప్రణాళికాయుతంగా అభివృద్ధి

ఖమ్మం నగర సమగ్రాభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేశామని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. IIలో



కోక లేకుండానే పండుగా?!

మహిళా సంఘాల సభ్యులకు బతుకమ్మ సందర్భంగా రెండేసి చీరలు పంపిణీ చేస్తామని ప్రకటించినా ఇప్పటివరకు అందలేదు. IIలో

గరిష్టం / కనిష్టం
31° / 23°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. సాయంత్రం తర్వాత కొన్నిచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అడిషనల్ డీసీపీగా రామానుజం



సీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న అడిషనల్ డీసీపీ

ఖమ్మంక్రైం: ఖమ్మం అడిషనల్ డీసీపీ(అడ్మిన్)గా బి.రామానుజం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలంగా ఖాళీగా ఈ పోస్టులో పదోన్నతి పొందిన రామానుజంకు పోస్టింగ్ ఇచ్చారు. గతంలో ఆయన ఉమ్మడి జిల్లాలో ఎస్‌ఐ, సీఐ, డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. బాధ్యతలు స్వీకరించాక సీపీ సునీల్ దత్‌ను మర్యాదపూర్వకంగా కలవగా, రామానుజంకు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాకు ఐదుగురు ఏఎంవీఐలు



ఏఎంవీఐలకు సూచనలు ఇస్తున్న ఆర్‌టీఓ వెంకటరమణ

ఖమ్మంక్రైం: ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న ఐదుగురు అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల(ఏఎంవీఐ)ను జిల్లాకు కేటాయించారు. ఈ సందర్భంగా సోమవారం వారు ఖమ్మంలో జిల్లా రవాణా శాఖాధికారి వెంకటరమణకు రిపోర్ట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏఎంవీఐల్లో సుమలత, రవిచందర్, గోపికృష్ణ, దినేష్‌కు ఖమ్మంలో, రాజశేఖర్‌రెడ్డికి సత్తుపల్లి కార్యాలయంలో బాధ్యతలు అప్పగించామని తెలిపారు. వీరు ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు నిర్వర్తిస్తారని చెప్పారు. కాగా, 15ఏళ్ల దాటిన వాహనాలకు ఆర్‌సీలు రెన్యూవల్ చేయించుకోవాలని వాహనదారులకు సూచించారు. ఓవర్‌లోడ్‌తో నడిచే వాహనాల గుర్తింపునకు తనిఖీలు ముమ్మరం చేస్తామని ఆర్‌టీఓ వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఏఓ సుధాకర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో 'బతుకమ్మ'



బతుకమ్మల వద్ద అధికారులు, ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: బతుకమ్మ సంబరాలు రెండో రోజైన సోమవారం కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖల ఆధ్వర్యాన నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు, ఉద్యోగులు సంబురాల్లో పాల్గొనగా.. బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు. ఎస్సీ అభివృద్ధి శాఖ ఇన్‌చార్జి డీడీ, బీసీడబ్ల్యూఓ జి.జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఎన్.విజయలక్ష్మి, మైనారిటీ శాఖ ఆర్‌సీఓ అరుణకుమారి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, వసతిగృహాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. పదో తరగతికి పరీక్షకు 63మందిలో 51మంది(80.95శాతం), ఇంటర్ పరీక్షకు 51మందిలో 40మంది(78.43 శాతం) హాజరయ్యారని ఇన్‌చార్జ్ డీఈఓ దీక్షారైనా, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కె.మంగపతిరావు తెలిపారు. కాగా, పలు కేంద్రాలను డీఐఈఓ రవిబాబు తనిఖీ చేశారు.

యూరియా కోసం రాత్రివరకూ పడిగాపులు



యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

నేలకొండపల్లి: నేలకొండపల్లి పీఏసీఎస్ పరిధి అప్పలనరసింహాపురం గోదాం వద్ద రాయగూడెం, అప్పలనరసింహాపురం రైతులకు సోమవారం సాయంత్రం యూరియా పంపిణీ మొదలుపెట్టారు. కేంద్రానికి 110 యూరియా బస్తాలు రాగా, గతంలో కూపన్లు జారీ చేసిన వారికి ఇస్తామని ప్రకటించారు. అయితే, గతంలో తీసుకున్న కొందరికే మళ్లీ ఇస్తున్నారని పలువురు ఆందోళనకు దిగారు. దీంతో ఏఓ ఎం.రాధ చేరుకుని అందరికీ కూపన్లు జారీ చేసి త్వరలోనే సరఫరా చేస్తామని నచ్చచెప్పారు. ఈ ఆందోళనతో ఆలస్యం జరగగా రాత్రి పొద్దుపోయే వరకు పోలీసు పహారా నడుమ పంపిణీ చేశారు.

ఏ సీటు ఏమవుతుందో ?!



ఏం చేద్దాం.. ఎక్కడ పోటీ చేద్దాం ?

రిజర్వేషన్ల మాటెలా ఉన్నా ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామపంచాయతీ, పరిషత్ ఓటర్ల తుది జాబితా విడుదలైంది. జిల్లాలోని 571 గ్రామపంచాయతీల్లో 8,02,691 మంది ఓటర్లు ఉండగా, 5,214 పోలింగ్ స్టేషన్లు గుర్తించారు. మండల పరిషత్‌ల పరిధిలో 8,02,690 ఓటర్లకు 1,580 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుచేస్తారు. ఇక రిజర్వేషన్లు ఖరారైతే ఈ నెలాఖరుకు ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందనే ప్రచారంతో ఆశావహులు వ్యూహ, ప్రతివ్యూహాల్లో నిమగ్నమయ్యారు. ఎక్కడి నుంచి పోటీ చేస్తే మంచిది, గ్రామపంచాయతీల్లో బరిలో నిలవాలా.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయాలా అన్న అంశాలపై అనుచరులతో చర్చిస్తున్నారు. ఏ స్థానం ఎవరికి రిజర్వ్ అవుతుందోనన్న అంచనాతో ఒకటి, రెండు స్థానాలు ఎంచుకుంటున్నట్లు తెలిసింది. ఎన్నికలు ఏ విధానంలో జరిగినా రాజకీయ పార్టీలే ప్రధాన పాత్ర పోషించనుండడంతో సీటు దక్కించుకునేందుకు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులను ఒప్పించడంపై ఇప్పటికే ఆశావహులు దృష్టి సారించారు.

గత ఎన్నికల్లో గ్రామపంచాయతీల రిజర్వేషన్లు

షెడ్యూల్ ఏరియా జీపీలు	99
ఎస్టీ మహిళ	50
ఎస్టీ జనరల్	49
నూరు శాతం ఎస్టీ జీపీలు	11
ఎస్టీ మహిళ	06
ఎస్టీ జనరల్	05
నాన్ షెడ్యూల్ ఏరియా జీపీలు	237
ఎస్టీ మహిళ	29
ఎస్టీ జనరల్	30
ఎస్సీ మహిళ	60
ఎస్సీ జనరల్	60
బీసీ మహిళ	29
బీసీ జనరల్	29
అన్ రిజర్వ్డ్ జీపీలు	237
మహిళలు	118
జనరల్	119

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఎలా ఉంటాయోనని రాజకీయ పార్టీల్లోనే కాక ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్ల వ్యవహారం ఎటూ తేలకపోవడంతోనే ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యాన ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తుండగా.. ప్రభుత్వం కూడా రిజర్వేషన్ల ఖరారుపై దృష్టి సారించింది. సోమవారం ఈ విషయమై చర్చించినట్లు తెలుస్తోంది. రిజర్వేషన్లు ఖరారైతే ఈనెలాఖరులోగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశముందన్న ప్రచారంతో అందరూ రిజర్వేషన్లు ఎలా ఉంటాయనే అంశంపై దృష్టి సారించారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై ఉత్కంఠ

- జెడ్పీలో కసరత్తు.. పరిశీలించిన కలెక్టర్
- ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆశావహులు
- ఈ నెలాఖరులోగా షెడ్యూల్ వెలువడుతుందని ప్రచారం

గడువు ముగిసి ఏడాదిన్నర

2019 ఏడాదిలో జిల్లాలోని 584 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా.. పాలకవర్గాల పదవీ కాలం 2024 ఫిబ్రవరి 1న ముగిసింది. గత పదహారు నెలల నుంచి పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. అలాగే జిల్లాలోని 289 ఎంపీటీసీలతో పాటు 20 జెడ్పీటీసీల గడువు కూడా ముగిసింది. ప్రస్తుతం ఎంపీటీసీ స్థానాలను పునర్విభజన చేయగా.. ఈనెల 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

ప్రధాన అడ్డంకి అదే..

స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యేందుకు రిజర్వేషన్ల వ్యవహారమే ప్రధాన అడ్డంకిగా మారింది. 2019 ఎన్నికల సందర్భంగా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018 గ్రామపంచాయతీ చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం జీపీల రిజర్వేషన్లు పదేళ్ల పాటు కొనసాగాలి. అంటే ఈసారి ఎన్నికలు కూడా ఆ రిజర్వేషన్ల ప్రకారమే నిర్వహించాలి. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించడంతో రిజర్వేషన్లు మారనున్నాయి. అంతేకాక బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించగా, ఈ రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తారనే చర్చ జరుగుతోంది.

చకచకా కసరత్తు

ఎన్నికల్లో రిజర్వేషన్ విధానాన్ని ఖరారు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జెడ్పీటీసీ, జెడ్పీ చైర్మన్, ఎంపీటీసీ, ఎంపీపీ, సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. సీఎస్ ఆదేశాలతో జిల్లాల వారీగా రిజర్వేషన్ల విధానం ఖరారవుతుంది. బీసీలకు 42శాతం, ఎస్సీ ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షాన లాటరీ విధానంలో మహిళా రిజర్వేషన్లు ప్రకటిస్తారు. ఇక షెడ్యూల్డ్ ఏరియాలో ఎస్టీ జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించి, నూరు శాతం ఎస్టీ గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవులు వారికే రిజర్వు చేయనున్నట్లు తెలిసింది. కాగా, కలెక్టర్ అనుదీప్ సోమవారం జిల్లా పరిషత్‌ను సందర్శించి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్లు ఉద్యోగులకు సూచనలు చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయంలోనే రిజర్వేషన్ల ప్రక్రియపై కసరత్తు జరుగుతుండడంతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యం



అంగన్‌వాడీ కేంద్రానికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి, పక్కన కలెక్టర్ అనుదీప్ తదితరులు

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ముదిగొండ మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ముదిగొండ: రాష్ట్రంలోని ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ముదిగొండ మండలం యడవల్లి, యడవల్లి లక్ష్మీపురంలో జీపీ భవనాలు, యడవల్లి, మాదాపురం, ముదిగొండ ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనం నిర్మాణాలకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి సోమవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో భట్టి విక్రమార్క మాట్లాడుతూ మధిర నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేసేలా కార్యాచరణ అమలుచేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వసతుల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని తెలిపారు. ఈమేరకు అభివృద్ధి పనులు నాణ్యతగా, త్వరగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. కాగా, తాము అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం, కొత్త కార్డుల మంజూరుతో పాటు రైతుల రుణమాఫీ, రైతు భరోసా, సన్న ధాన్యానికి బోనస్ తదితర పథకాలు అమలుచేస్తున్నామని తెలిపారు. అంతేకాక అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ప్రతీ నియోజకవర్గంలో నిర్మించనున్నట్లు భట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్ అండ్ బీ, పీఆర్ ఎస్‌ఈలు యాకోబు, వెంకట్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల ఊబి నుంచి బయటపడేలా..

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వాన మంత్రి వర్గంలో చేస్తున్న కృషిని గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని డిప్యూటీ సీఎంభట్టి తెలిపారు. ముదిగొండలో ఏర్పాటుచేసిన సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్‌లో చేరగా భట్టి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించాక మాట్లాడారు. తమ ప్రభుత్వం ప్రజల అభ్యున్నతికే కాదు రాష్ట్ర ప్రగతికి వేస్తున్న పునాదులను చూసి కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతాయని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తెలంగాణను ఇస్తే గత పాలకులు రూ.లక్షల కోట్ల అప్పులు మిగిల్చారని ఆరోపించారు. అంతేకాక ఆర్థికంగా, పాలనాపరంగా వ్యవస్థలను విధ్వంసం చేశారని పేర్కొన్నారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోగా, మాజీ సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సుజల స్రవంతి ప్రాజెక్టును మూలన పడేశారని ఆరోపించారు. గత పాలకుల తీరుతో నెలకు రూ.11 వేల కోట్లు వడ్డీ కడుతుండగా, అప్పుల ఊబి నుంచి బయటపడేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఇదేసమయాన సంక్షేమ పథకాలు అమలుచేస్తూనే ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ ప్రజలకు సమయం కేటాయిద్దామంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కారణంగా రోజుకు 18 గంటల పాటు పనిచేసినా ఫలితం ఉండడం లేదని చెప్పారు. ఈసమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు పాలకవర్గాలనే కొనసాగించండి

కల్లూరు: జిల్లాలోని ఆరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పాలకవర్గాలను రద్దు చేసి పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించిన విషయంలో హైకోర్టు సోమవారం స్టే జారీ చేసింది. ఈమేరకు పాత పాలకవర్గాలనే కొనసాగించాలని ఆదేశించింది. పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువును ప్రభుత్వం ఆరు నెలలు పొడిగించగా, వివిధ ఆరోపణలతో కల్లూరు, పోచారం, ఏదులాపురం, చేగొమ్మ, నేలకొండపల్లి, తల్లాడ పీఏసీఎస్‌లకు పాలకవర్గాల స్థానంలో పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించడంతో బాధ్యులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు స్పెషల్ ఆఫీసర్ల నియామకంపై స్టే ఇస్తూ పాత పాలకవర్గాలనే కొనసాగించాలని ఆదేశించింది.

ఖాళీల జాబితా ఇవ్వండి

- కారుణ్య నియామకాలతో భర్తీ చేస్తాం
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, కార్యాలయ సబార్డినేట్ పోస్టుల ఖాళీల వివరాలను వారంలోగా అందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. ఈ ఖాళీల ఆధారంగా కారుణ్య నియామకాలు చేపడుతామని తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ కారుణ్య నియామకాలతో వేచి ఉన్న వారికి న్యాయం జరగడమే కాక ఖాళీలు భర్తీ అవుతాయని తెలిపారు. ఇక ప్రజావాణిలో అందే దరఖాస్తులను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. కాగా, యూడైస్ పోర్టల్ ప్రకారం విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు లేని పాఠశాలలపై నివేదిక ఇస్తే వసతులు కల్పిస్తామని తెలిపారు. జిల్లా అధికారులు సంక్షేమ వసతి గృహాలను ప్రతీ వారం తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- ఏన్కూరు మండలం జన్నారం రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 200లో సుమారు 2వేల ఎకరాల భూమిగుట్టలతో ఉన్నందున అన్యాక్రాంతం కాకుండా ప్రజావసరాల కోసం వినియోగించాలని యంత్రాతి శ్రీనివాసరావు తదితరులు కోరారు.
- కూసుమంచి మండలం నరసింహులగూడెంకు చెందిన రత్నకుమారి, పుష్ప, భద్రమ్మ తమకు సర్వే నంబర్ 1,123లో భూమి పంపిణీ చేస్తే, ఇతరులు బాటను కబ్జా చేశారని ఫిర్యాదు చేశారు.
- చింతకాని మండలం లచ్చగూడెం రైతులు పెసల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.
- దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ వినతిపత్రం అందజేశారు.
- ఖమ్మంలోని అంబేద్కర్ గురుకుల కళాశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కోరారు.
- మెనూ ప్రకారం భోజనం వడ్డించకుండా నిర్లక్ష్యం చేస్తున్న బోనకల్ బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు.

హైవేల అభివృద్ధికి చర్యలు

ఖమ్మంఅర్బన్: జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి, అనుసంధాన రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. హైదరాబాద్ నుంచి సీఎం వీసీ ద్వారా కలెక్టర్లతో సమీక్షించి పలు అంశాలపై తుమ్మల లేఖ సమర్పించారు. ఖమ్మం – దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేకు రెండు వైపులా సర్వీస్ రోడ్లు, ఖమ్మం రింగ్ రోడ్డు పూర్తికి ఖమ్మం – కురవి రోడ్డు నుండి కలెక్టరేట్ వరకు ఏడు కి.మీ. అనుసంధాన రహదారి నిర్మాణం, జగ్గయ్యపేట – కొత్తగూడెం వయా బోనకల్, వైరా, తల్లాడ జాతీయ రహదారికి ప్రతిపాదించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, మరికొన్ని రహదారుల మంత్రి లేఖ అందించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని సీఎంను కోరారు.

ప్రాధాన్యతాక్రమంలో భూసేకరణ

జాతీయ రహదారులకు అవసరమైన భూమిని ప్రాధాన్యత ప్రకారం సేకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎస్ కె.రామకృష్ణారావు, ఉన్నతాధికారులతో కలిసి సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. ఎన్‌హెచ్, రాష్ట్ర అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ హైవేల అవసరాలకు భూసేకరణలో వేగం పెంచాలని తెలిపారు. జిల్లా నుంచి కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ ఎన్‌హెచ్ 163జీ హైవేకు అవసరమైన భూమి సేకరణ ఈనెలాఖరులతోగా పూర్తిచేస్తామని చెప్పారు. అలాగే, మల్లెమడుగు, రేగులచలక గ్రామాలకు సంబంధించి పరిహారం చెల్లింపుపై దృష్టి సారిస్తామని తెలిపారు. వీసీలో డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, నేషనల్ హైవే ఈఈ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ఎర్రుపాలెం: జమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా శ్రీవారికి పంచామృతంతో అభిషేకం నిర్వహించాక ఆలయ పుష్కరిణి నుంచి సాయంత్రం తీర్థపు బిందెను తోడ్కొని వచ్చారు. అనంతరం యాగశాలలో స్వామి, అమ్మవార్లకు ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ జగన్మోహన్‌రావు, దాతలు తుళ్లూరు కోటేశ్వరరావు దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించాక ఉత్సవాలు ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేశాక అమ్మవార్లను చందనంతో అలంకరించగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కాగా, శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని మంగళవారం బాలాత్రిపుర సుందరీదేవి రూపంలో అలంకరించనున్నారు. ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, అర్చకులు, సిబ్బంది, నాయకులు తల్లపురెడ్డి వెంకట్రామిరెడ్డి, నన్నపనేని రామారావు, వేజండ్ల సాయికుమార్, మున్నలూరి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



తీర్థపు బిందెతో వస్తున్న అర్చకులు, ఈఓ

దందాకు ఆ భూములే దన్ను

- ఇదీ.. గంగాపురం మున్నేరు లంక భూముల కథ
- అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపణలు
- పంట లేకున్నా రైతుభరోసా.. ఆపై ఇసుక దందా
- అధికారులు సర్వే చేస్తేనే బయట పడనున్న బండారం



చిన్న మండవ మున్నేటి వద్ద లంక భూములు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ముదిగొండ మండలం గంగాపురం రెవెన్యూ పరిధిలో మున్నేటి లంక భూములు ఇసుక దందాకు దన్నుగా నిలుస్తున్నాయి. చింతకాని మండలం చిన్నమండవ వైపు ఉన్న ఈ భూముల్లో ఏళ్లగా దందా సాగుతున్నా అధికారులెవరూ కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న కొందరు భూముల మాటున మున్నేటిని చెరబట్టిన విషయం ఇందిరమ్మ లబ్ధిదారుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడమే కాక భూమిపై సదరు వ్యక్తులు రైతు భరోసా పొందుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై క్షేత్రస్థాయిలో విచారిస్తే ఎంత మేర మున్నేటి లంకభూమి ఆక్రమణకు గురైంది, హక్కుదారులు ఎవరు, ఆక్రమణదారులు ఎవరో తేలనుంది. ఈ అంశంపై విచారణకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరిని ప్రత్యేక అధికారిగా కలెక్టర్ అనుదీప్ నియమించారు.

అటు లంక.. ఇటు వక్ఫ్ భూమి

గంగాపురం రెవెన్యూ పరిధిలో చిన్నమండవ మున్నేటి వైపు 67.28 ఎకరాల లంక భూమి ఉంది. ఈ భూమిని వివిధ ప్రాంతాల వ్యక్తులు కొనుగోలు చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందారు. సాగుకు యోగ్యం కాని ఈ లంక భూమిలో ఇసుక వ్యాపారం చేయడం కోసమే కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. సుమారు 150 ఎకరాల మేర మున్నేటి ప్రాంతంలోకి వెళ్లి ఇసుక దందా కొనసాగిస్తున్నారు. ఇక్కడ వక్ఫ్ భూమి కూడా 15 ఎకరాలనూ కలుపుకున్నారనే ఆరోపణలున్నాయి. 122వ సర్వేనంబర్ నుంచి 126వ సర్వే నంబర్ వరకు 67.28 ఎకరాలు ఉండగా.. బై నంబర్లతో ఆక్రమించుకున్న భూమికి పట్టాదారు పాస్ పుస్తకాలు దక్కించుకోవడం గమనార్హం.

ఫోర్జరీ సంతకాలతో..

చిన్నమండవ రెవెన్యూ వైపు ఉన్న లంక భూములకు సంబంధించి అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తనతో పాటు ఆయన కొడుకు పేరిట 2018లో పాస్ పుస్తకాలు పొందాడు. అయితే, గంగాపురం రెవెన్యూ పరిధి లంక భూములపై అంతకుముందే పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. ఫోర్జరీ సంతకాలతో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి పట్టదారు పాస్ పుస్తకాలు పొందినట్లు గుర్తించి 2019లో వాటిని రద్దు చేశారు.

ఈ భూములకు ఎలా?

ఎనిమిది ఎకరాలకు ఓ వ్యక్తి పొందిన పాస్ పుస్తకాలను రద్దు చేసిన అధికారులు.. దాదాపు 150 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకుని పట్టాదారు పుస్తకాలు పొందిన వారిపై మాత్రం చర్యలు తీసుకోలేదు. 123 నుంచి 126వ సర్వేనంబర్ వరకు అంతకుముందే పాస్‌పుస్తకాలు పొందిన వారి పత్రాలను ఎందుకు పరిశీలించలేదు, చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్న ప్రశ్నలకే కాక ఇన్ని ఎకరాల భూమిలో దందా సాగిస్తుంటే ఏం చేశారన్న ప్రశ్నలకు అధికారుల నుంచి సమాధానం రావడం లేదు. గంగాపురం గ్రామం పూర్తిగా కనుమరుగైనప్పుడు ఆ రెవెన్యూ పరిధిలో సాగుకు యోగ్యం కాని భూములను రిజిస్ట్రేషన్లు చేయకూడదనే నిబంధన ఉన్నా కొందరు అధికారుల అండదండలతో అక్రమార్కులు పాస్ పుస్తకాలు పొంది ఇసుక దందా చేస్తూ రూ.కోట్లలో ఆర్జిస్తున్నారు. ఇది కాక సాగుకు యోగ్యం కాని ఈ భూమిలో గత ప్రభుత్వంతోపాటు ప్రస్తుత ప్రభుత్వం నుంచి కూడా రైతుభరోసా పొందుతున్నారు. ఈ భూములపై అధికారులపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టి పాస్ పుస్తకాలను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వస్తోంది.

నేడు రెవెన్యూ, మైనింగ్ అధికారుల సర్వే

మున్నేటి లంక భూముల్లో ఏళ్లగా సాగుతున్న ఇసుక దందాపై డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కతో పాటు జిల్లా అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో కలెక్టర్ అనుదీప్ ఆదేశాలతో మూడు రోజుల క్రితం ఎస్‌డీసీ రాజేశ్వరి లంక భూములను పరిశీలించారు. మున్నేటిలో నిర్మించిన రహదారి తొలగించగా.. సర్వే చేయాలని సూచించారు. ఈమేరకు సోమవారమే రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు సర్వే చేయాల్సి ఉన్నా డిప్యూటీ సీఎం ముదిగొండ పర్యటన నేపథ్యాన మంగళవారానికి వాయిదా పడింది.

క్లుప్తంగా

టీటీడీ కల్యాణ మండపం పునఃప్రారంభం


కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న నీరజ, నాయకులు

కల్లూరు: కల్లూరులో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన 1995లో నిర్మించిన కల్యాణ మండపం కొన్నాళ్ల క్రితం మూతపడింది. స్థానికులకు ఉపయోగంగా ఉన్న ఈ మండపం మూతపడగా ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో కార్యక్రమాల నిర్వహణకు ఆర్థిక భారం పడుతోంది. దీంతో టీటీడీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కల్యాణ మండపాన్ని పునఃప్రారంభించేందుకు అంగీకరించారు. దీంతో మండపాన్ని మార్కెట్ చైర్‌పర్సన్ బాగం నీరజ, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఈమేరకు స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్వాహకులు ఎనుముల రాము, ఎనుముల రుక్మిణీ యాదవ్‌తో పాటు నాయకులు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, పెద్దబోయిన శ్రీను, ఏనుగు సత్యంబాబు, తల్లపురెడ్డి హన్విరెడ్డి, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, నోటికృష్ణా రెడ్డి, జిల్లెళ్ల కృష్ణారెడ్డి, తండు రాములు, పుల్లాచారి పాల్గొన్నారు.

వర్షం, గాలిదుమారంతో పంటలకు నష్టం


నేలవాలిన పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ సీతారాంరెడ్డి

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి గాలిదుమారంతో పాటు భారీ వర్షం కురిసింది. దీంతో పత్తి, మిర్చి పంటలు నేలవాలాయి. పూత, కాత దశలో ఉన్న పత్తికి ఈ వర్షంతో నష్టం ఎదురైంది. ఈమేరకు దమ్మాయిగూడెం, తెట్టెలపాడు, ఎదుళ్లచెరువు, పిండిప్రోలు, గోల్‌తండా, జింకలగూడెం తదితర గ్రామాల్లో పత్తి చేన్లను మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి పరిశీలించారు. పంటల నష్టంపై జిల్లా అధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు.

లధాక్ మారథాన్‌లో కానిస్టేబుల్ ప్రతిభ


కానిస్టేబుల్ రాజును అభినందిస్తున్న సీపీ


ఖమ్మంక్రైం: ప్రపంచంలోనే ఎత్తయిన లధాక్ వద్ద నిర్వహించిన మారథాన్‌లో ప్రతిభ చాటిన ఏఆర్ కానిస్టేబుల్ పిల్లి రాజును పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సోమవారం అభినందించారు. ఈనెల 14వ తేదీన నిర్వహించిన మారథాన్‌ను 5–36గంటల్లో పూర్తిచేసి రికార్డు సాధించారని తెలిపారు. ఖమ్మం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న రాజు గతంలోనూ పలు మారథాన్లలో పతకాలు సాధించారు. ఈ సందర్భంగా తనను ప్రోత్సహిస్తున్న తెలంగాణ స్పోర్ట్స్ అధికారి రమేష్, సీపీ సునీల్‌దత్, డీసీపీ కుమారస్వామి, ఆర్ఐ కామరాజు, ఎంటీఓ శ్రీశైలంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మండపాల్లో జాగ్రత్తలు తప్పనిసరి


వీసీలో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు

ఖమ్మంక్రైం: దేవీ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా మండపాలు ఏర్పాటుచేసిన వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అడిషనల్ డీసీపీ(లా అండ్ ఆర్డర్) ప్రసాద్‌రావు సూచించారు. జిల్లాలోని పోలీసు అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వేడుకలు జరిగే చోట్ల అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేయాలని తెలిపారు. అలాగే, భద్రతా చర్యలు పాటించేలా నిర్వాహకులకు సూచనలు చేయాలన్నారు. అన్ని మండలాలను జియోట్యాగ్ చేయాలని సూచించారు. అంతేకాక మహిళలు బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,107

కోక లేకుండానే పండుగా ?!

- ఎస్‌హెచ్‌జీల సభ్యులకు అందని 'రేవంతన్న కానుక'
- జిల్లాకు 3,35,879 చీరలు కేటాయింపు
- 1,80,779 చీరలే చేరడంతో పంపిణీపై సందిగ్ధత


మహిళలకు పంపిణీ చేయనున్న చీరల మోడళ్లు

ఖమ్మంమయూరిసెంటర్: 'అక్కాచెల్లెళ్లకు మీ రేవంతన్న కానుక' పేరుతో స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బతుకమ్మ పండుగ నాటికి సభ్యులకు రెండేసి చీరలు ఇస్తామని ప్రకటించారు. అయితే, బతుకమ్మ పండుగ రెండు రోజులు గడిచినా జిల్లాకు పూర్తి స్థాయిలో చీరలే చేరకపోగా.. పంపిణీపై యంత్రాంగం అయోమయంలో పడిపోయింది. కనీసం ఒక్కో చీర ఇవ్వాలని భావించినా ఆ స్థాయిలో స్టాక్ రాకపోవడం.. కొందరికే ఇస్తే ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో తెలియక పెండింగ్ పెట్టినట్లు తెలుస్తోంది.

స్టాక్ పాయింట్లకు 1.80 లక్షల చీరలు

మహిళా సంఘాల సభ్యులకు అందించే చీరలను జిల్లాలకు సరఫరా చేసింది. జిల్లాలో 3,35,879 మంది సభ్యులకు చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించగా.. సెర్ప్, మెప్మా పరిధిలోని సంఘాల సభ్యులను గుర్తించారు. ఒక్కో సభ్యురాలికి రెండేసి చీరలు పంపిణీ చేసేందుకు మొత్తం 6,71,758 చీరలు అవసరమవుతాయి. మొదటి విడతలో 3,35,879 చీరలు సరఫరా చేస్తామని ప్రకటించినా అందులో 1,80,779 చీరలే వచ్చాయి. దీంతో చీరలను సెర్ప్ అధికారులు గోదాంల్లో భద్రపరిచారు. ఇక మెప్మాకు సంబంధించి సంఘాల్లోని సభ్యులకు సరఫరా చేసేందుకు ఒక్క చీర కూడా జిల్లాకు చేరలేదు.

ఒక చీర ఇవ్వాలన్నా..

గతేడాది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినట్లుగా ఈ ఏడాది బతుకమ్మ పండుగ నాటికి మహిళ సభ్యులకు చీరలు అందుతాయని అంతా భావించారు. ఈనెల 5వ తేదీ నుంచే ప్రభుత్వం జిల్లాలకు చీరల సరఫరాను ప్రారంభించింది. ఈ నెల 9వ తేదీ నాటికి 1.80 లక్షల చీరలే రాగా.. మిగిలిన చీరలు ఎప్పుడు వస్తాయో తెలియడం లేదు. బతుకమ్మ వేడుకల మొదటి రోజే ఒక్కో చీర అయినా పంపిణీ చేస్తారని భావించినా అలా జరగలేదు. జిల్లాలోని సభ్యులకు ఒక్కో చీర పంపిణీ చేయాలన్నా ఇంకా 1,55,100 చీరలు అవసరం కావడం.. అవి ఎప్పుడు వస్తాయో తెలియక అధికారులు ఉన్నత స్థాయి ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు.

గోదాంల వారీగా జిల్లాకు కేటాయించిన చీరలు

గోడౌన్	కేటాయించిన చీరలు	చేరినవి
జిల్లా సమాఖ్య, టేకులపల్లి	1,50,084	98,640
వైరా ఏఎంసీ	52,399	26,200
మధిర ఏఎంసీ	34,254	17,127
సత్తుపల్లి ఎంఎస్ ఆఫీసు	38,812	38,812
మెప్మా	60,330	000
మొత్తం	3,35,879	1,80,779

వేతనాల కోసం 'భగీరథ' కార్మికుల సమ్మె

పలు ప్రాంతాల్లో నిలిచిన నీటి సరఫరా

వైరా/తిరుమలాయపాలెం: మిషన్ భగీరథ పథకం కార్మికులు పెండింగ్ వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో సోమవారం సమ్మెకు దిగారు. ఈమేరకు వైరాలోని భగీరథ కార్యాలయం ఎదుట ధర్నా చేయగా.. వివిధ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈనెల 7వ తేదీన జీతాలు ఇస్తామని హామీ ఇచ్చిన అధికారులు 15రోజులు దాటినా స్పందించడం లేదని ఆరోపించారు. దీంతో పండుగ వేళ పస్తులు ఉండలేక సమ్మెకు దిగారని తెలిపారు. కాగా, తిరుమలాయపాలెం మండలంలోని మాదిరిపురం భగీరథ పంపుహౌజ్ వద్ద కూడా కార్మికులు ధర్నా నిర్వహించి మండల వ్యాప్తంగా నీటి సరఫరా నిలిపేశారు. కార్మికుల సమ్మెతో జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ కార్యక్రమాల్లో వివిధ సంఘాల నాయకులు, జేఏసీ బాధ్యులు తిరుమలాచారి, బొంతు రాంబాబు, చింతనిప్పు చలపతిరావు, బాణాల వెంకటేశ్వరరావు, పాపగంటి రాంబాబు, అన్నం వెంకయ్య, వేల్పుల అనంతరావు, అనుబోతు బాలకృష్ణ, మద్దెల రవి, బత్తుల కిషోర్, యాకూ బ్ వలీ, శ్రీనివాసరావు, భరత్, ఉపేందర్, అన్వేష్, వెంకన్న, శ్రీను, నాగేశ్వరరావు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.


తిరుమలాయపాలెం : పంపుహౌజ్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

చట్టాలపై అవగాహన అవసరం

ఖమ్మం లీగల్: ప్రతీఒక్కరు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు సూచించారు. తద్వారా నష్టం ఎదురైతే న్యాయసాయం పొందొచ్చని తెలిపారు. ఖమ్మంలోని మంచికంటి భవన్‌లోలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టాలపై అందరూ అవగాహన పెంచుకుని, నానాటికీ పెరుగుతున్న సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. అనంతరం టోల్‌ఫ్రీ నంబర్లు 1930, 15100, న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందే ఉచిత న్యాయసాయంపై న్యాయమూర్తి అవగాహన కల్పించారు. సైబర్ క్రైం ఏసీపీ ఫణీందర్, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయమూర్తి చంద్రశేఖర్‌రావు

రీజినల్ స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రిత్వ శాఖ, ఎన్ఏసీఓ ఆధ్వర్యాన ఎనిమిది రాష్ట్రాల స్థాయి క్విజ్ పోటీలు బీహార్ రాష్ట్రంలో ఇటీవల నిర్వహించగా ఖమ్మం ఏఎస్‌ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాల విద్యార్థిని దేవీ శ్రీప్రసన్న ప్రథమ బహుమతి సాధించిందని ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ తరఫున కాలేజీల స్థాయి, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఆమె రీజినల్ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటిందని వెల్లడించారు. ఈ సందర్భంగా రూ.50వేల నగదు బహుమతి అందుకోగా, నాగాలాండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. విద్యార్థిని శ్రీప్రసన్నతో పాటు ఆమెను ప్రోత్సహించిన అధ్యాపకులు నరేష్, కౌన్సిలర్ భరత్‌కుమార్, లింగానాయక్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.


బహుమతి అందుకుంటున్న దేవి శ్రీప్రసన్న

విద్యార్థినికి చేయూత

ఖమ్మం సహకారనగర్: చింతకాని మండలంలోని పాతర్లపాడుకు చెందిన గార్లపాటి మనీషా ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. ఆమె చదువు ఖర్చుల కోసం ఖమ్మంకు నన్నక శ్రీనివాసరావు సోమవారం రూ.12వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నన్నక లక్ష్మయ్య, రంగమ్మ, పుష్పలత పాల్గొన్నారు.


దాతలతో విద్యార్థిని మనీషా


జనరల్ ఓపీ చీటీల కోసం క్యూలో జనం

పెద్దాస్పత్రి కిటకిట..

ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రి సోమవారం కిటకిటలాడింది. జనరల్ ఆస్పత్రితో పాటు మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని ఓపీ విభాగాల్లో బారులుదీరారు. ఓపీ చీటీ కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. జిల్లాలో ఉదయం ఎండ, రాత్రి వర్షం వస్తూ భిన్నమైన వాతావరణం ఉండడంతో జనం వ్యాధుల బారిన పడుతున్నారు. ఈక్రమాన ఆదివారం సెలవు కాగా, సోమవారం వైద్యసేవల కోసం ఆస్పత్రికి జనం పోటెత్తారు. ఓపీ చీటీ తీసుకోవడానికే సమయం పట్టగా ఆ తర్వాత పరీక్షలు, చికిత్స కోసం మరికొంత సమయం వేచి ఉండక తప్పలేదు.

– ఖమ్మం వైద్యవిభాగం


ఎంసీహెచ్‌లో ఓపీ వద్ద మహిళలు

వరి పైర్లను పరిశీలించిన అధికారులు


పొలంలో పరిశీలిస్తున్న ఏఓ, తదితరులు

సాక్షి ఎఫెక్ట్..

తల్లాడ: తల్లాడ మండలం పలు గ్రామాల్లోని వరి పైర్లలో కలుపు పెరిగి ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేక రైతులు ఆందోళన చెందుతున్న విషయమై 'సాక్షి'లో సోమవారం 'కలుపు మందుల్లోనూ కల్తీ' శీర్షికన కథ నం ప్రచురితమైంది. దీంతో బిల్లుపాడు, అన్నారుగూడెంల్లో వరి పైర్లను ఏఓ ఎండీ.తాజుద్దీన్ తదితరులు పరిశీలించారు. ఈ సమస్య మండలంలోని వెదజల్లిన పద్ధతిలో వరి సాగు చేసిన పొలాల్లోనే ఉందని తెలిపారు. పరిశీలన కోసం శాస్త్రవేత్తలను పంపించాలని డీఏఓను కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ హసీనా, రైతులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

కారేపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని మంగళితండా గ్రామానికి చెందిన రైతు ధరావత్ పంతులు నాలుగెకరాల్లో పత్తి, వరి సాగు చేస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో సోమవారం ఇంటి వద్ద ఆయన పురుగులమందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ ఇల్లెందులో చికిత్సఅనంతరం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ప్రణాళికాయుతంగా ఖమ్మం అభివృద్ధి

- దేవుళ్లు ఎప్పటికీ ప్రజలను ఇబ్బంది పెట్టరు...
- అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు

ఖమ్మం అర్బన్: ఖమ్మం నగరాన్ని ప్రణాళికాయుతంగా అభివృద్ధి చేసేలా మాస్టర్ ప్లాన్ రూపొందించామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం 12వ డివిజన్‌లో రూ.49.80 లక్షలతో నిర్మించనున్న పెట్ పార్క్, రూ.89 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు విస్తరణ, కల్వర్టు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశాక మాట్లాడారు. అభివృద్ధి పనులు పది కాలాల పాటు నిలిచేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. భూఆక్రమణలను అధికారులు మొదటి దశలోనే అడ్డుకోవాలని స్పష్టం చేశారు. కాగా, రోడ్లపై ప్రార్థనా మందిరాలు అవసరం లేదని, దేవుళ్లు ఎప్పటికీ ప్రజలకు ఇబ్బంది కలిగించరని అన్నారు. చెరువు బజార్, రైల్వే స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రహదారుల విస్తరణతో ఖమ్మం వాసులకు ట్రాఫిక్ ఇక్కట్లు తీరతాయని తెలిపారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, మేయర్ పి.నీరజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్లు చిరుమామిళ్ల లక్ష్మీనాగేశ్వరరావు, కమర్తపు మురళి, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, బోడా శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లాభసాటి పంటల సాగుపై దృష్టి

రఘునాథపాలెం: రైతులు లాభసాటి పంటలైన ఆయిల్ పామ్ తదితరాల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రఘునాథపాలెం మండలం లచ్చిరాం తండాలో రూ.2.15 కోట్ల వ్యయంతో చేపట్టే బీటీ రోడ్డు విస్తరణ, రూ.80 లక్షలతో నిర్మించే వంతెన పనులకు అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేస్తే ప్రభుత్వం నుంచి సాయం అందుతుందని, మిర్చి, కూరగాయలను అంతర్ పంటలుగా సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందొచ్చని తెలిపారు. వచ్చే వేసవిలో రఘునాథపాలెం మండలంలోని ప్రతీ చెరువులను నింపే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. కాగా, విద్యుత్ లైన్ల మార్పునకు అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించిన మంత్రి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సాయం, ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పొందిన రైతుల విషయమై సూచనలు చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, పీఆర్ ఈఈ మహేష్ బాబు, విద్యుత్ డీఈ రామారావు, ఏడీఈలు సంజయ్‌కుమార్, సతీష్, చిరంజీవి, తహసీల్దార్ శ్వేత, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ యలగొండస్వామి, ఎఫ్ఆర్ఓ నాగేశ్వరరావు, మార్కెట్, ఆత్మ కమిటీల చైర్మన్లు యరగర్ల హన్మంతరావు, దిరిశాల వెంకటేశ్వర్లు, నాయకులు మానుకొండ రాధాకిషోర్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాధు రమేష్‌రెడ్డి, దేవ్‌సింగ్, బాషా, కొంటెముక్కల నాగేశ్వరరావు, లాలు, కృష్ణప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా క్రీడాజట్లు సిద్ధం

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా పాఠశాలలు, జూనియర్ కళాశాలల క్రీడా సంఘాల ఆధ్వర్యాన వివిధ క్రీడాంశాల్లో జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానం, పటేల్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా పాఠశాలల స్థాయి అండర్–19 ఫుట్‌బాల్ జట్లు, అండర్–17, 19 ఉషూ జట్ల ఎంపికకు పోటీలు నిర్వహించారు. అండర్–19 బాలుర ఫుట్‌బాల్ ఎంపికలకు 50 మంది, ఉషూ ఎంపికలకు 45 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కాగా, ఫుట్‌బాల్ జట్టు జనగామలో ఈనెల 24నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో, ఉషూ జట్లు ఈనెల 25నుంచి మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని క్రీడా సంఘాల కార్యదర్శులు ఎం.డీ.మూసాకలీం, పి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపిక పోటీలను డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి ప్రారంభించగా, వివిధ క్రీడల కోచ్‌లు కె.ఆదర్శ్‌కుమార్, పి.పరిపూర్ణాచారి, భీమ్‌రాజ్, సైదేశ్వరరావు, ముజాహిద్, చంద్రశేఖర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జట్ల వివరాలు...

ఉమ్మడి జిల్లా అండర్–19 ఫుట్‌బాల్ జట్టుకు ఎస్‌డీ.యాసీర్ పాషా, బి.భరత్‌కుమార్, హెచ్.సాయి సృజన్, జి.అభిరాం, టి.కార్తీక్, వి.శివగోపాల్, జి.ప్రజీత్, డి.ఆనంద్‌బాబు, సీహెచ్.చెన్నకేశవ్, కె.అఖిల్, పి.శ్రీహర్ష, హెచ్.రుత్విక్, సీహెచ్.ఆకాష్, టి.యశ్వంత్, ఈ.ఉదయ్‌రాం, జి.సిద్ధార్థ, కె.నిశాంత్ ఎంపికవగా, స్టాండ్ బైగా టి.హేమంత్, ఏ.మనోజ్, ఏ.ప్రేమ్ కుమార్, ఏ.సానత్, బి.శ్యాంప్రసాద్‌ను ఎంపిక చేశారు. అలాగే, ఉషూ జట్లకు సాయిమహర్షి, హర్షణ్, కె.చక్రధర్ ఆర్యన్, అభిషేక్‌గౌడ్, యజ్ఞసేన్, ఉమర్ రూఖ్, చైత్ర వర్షిణి, సంజన, భావన, జాస్మిన్, షేక్ ఫిరోజ్, ఎం.డీ ఫారూఖ్‌బేగ్ ఎంపికయ్యారు.


ఉమ్మడి జిల్లా ఉషూ జట్లు

అభివృద్ధి పేరుతో అరాచకాన్ని అడ్డుకుంటాం..

పాదయాత్రలో సీపీఎం నాయకులు

ఎర్రుపాలెం: అభివృద్ధి పేరుతో అరాచకాలు, అక్రమాలకు పాల్పడితే అడ్డుకుంటామని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు. అనుమతి లేని క్వారీల నుండి మట్టి తరలింపును అడ్డుకోవడమేకాక అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో జమలాపురంలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద నుంచి ఎర్రుపాలెం తహసీల్ వరకు నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో అక్రమ క్వారీలు కొనసాగుతున్నా బాధ్యులపై ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అభివృద్ధిని తాము స్వాగతిస్తున్నా, అక్రమాలను సహించబోమని తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఎం.ఉషాశారదకు వినతిపత్రం అందచేసి కార్యాలయ ఆవరణలోనే భోజనాలకు సిద్ధం కాగా ఎస్ఐ రమేష్ సూచనలతో డెయిరీ ప్రాంగణానికి వెళ్లారు. కాగా, పాదయాత్ర సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు దివ్వెల వీరయ్య, మడుపల్లి గోపాలరావు, మద్దాల ప్రభాకర్, గొల్లపూడి కోటేశ్వరరావు, నల్లమోతు హన్మంతరావు, బషీరుద్దీన్ అప్పారావు, కుమారి తదితరులు పాల్గొన్నారు.


పాదయాత్రలో నాగేశ్వరరావు, నాయకులు

కూర వేయలేదని కత్తితో దాడి

ఖమ్మంఅర్బన్: అడిగితే కూర వేయలేదనే కోపంతో తోటి కార్మికురాలిపై కత్తితో ఓ వ్యక్తి దాడి చేశాడు. ఖమ్మం ఖానాపురం పారిశ్రామిక ప్రాంతంలో ఓ రెడీమేడ్ కిటికీల తయారీ సంస్థ కొనసాగుతుండగా కై కొండాయిగూడెంకు చెందిన బానోతు రుక్మిణి, రఘునాథపాలెం మండలం కోటపాడుకు చెందిన రవి తదితరులు పనిచేస్తున్నారు. భోజన సమయాన రుక్మిణిని కూర వేయాలని రవి కోరగా ఆమె నిరాకరించింది. దీంతో రవి ఆగ్రహంతో వెనుక నుంచి కత్తితో దాడి చేయగా ఆమె మెడ, చేతులపై తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ మాట్లాడుతూ నిందితుడు పరారీలో ఉండగా, ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

'కేజీబీవీ వర్కర్ల అరెస్టు సరికాదు'

ఖమ్మంమయూరిసెంటర్: ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన కార్మికుల డిమాండ్ల సాధనకోసం చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తే ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు. కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించడంతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలపాలని ప్రయత్నిస్తే భగ్నం చేయాలనుకోవడం గర్హనీయమని తెలిపారు. అధికారంలోకి రాకముందు ఇందిరా పార్కు ఆందోళనలో భాగస్వామ్యమైన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు కార్మికుల విషయంలో వ్యవహరిస్తున్న తీరు సరిగ్గా లేదని రంగారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

చింతకాని: ముదిగొండ మండలం గంధసిరి మున్నేటి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను చింతకాని జగన్నాథపురం వద్ద సోమవారం పోలీసులు సీజ్ చేశారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేవని తేలడంతో ట్రాక్టర్లను సీజ్ చేసి బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరేందర్ తెలిపారు.

కల్లూరులో టిప్పర్..

కల్లూరు: అనుమతి లేకుండా ఏపీ నుంచి 35 టన్నుల ఇసుక తీసుకొస్తున్న టిప్పర్‌ను సోమవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ డి.హరిత తెలిపారు. ఈమేరకు ఎన్టీఆర్ జిల్లా కంచకచర్ల మండలం కీసరకు చెందిన డ్రైవర్ చలమల స్వామి, కొత్తపాలెంకు చెందిన యజమాని కంచేటి గోపాలకృష్ణను విచారించామని పేర్కొన్నారు. ఏపీలో ఇసుక టన్నుకు రూ.600 వస్తుండగా తెలంగాణలో రూ.1,500 ధర ఉండడంతో తీసుకొస్తున్నట్లు అంగీకరించారని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెనుబల్లి: మండంలోని పాత కారాయిగూడెం శివారులో సోమవారం పలువురు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, మరికొందరు పారిపోయాయి. పట్టుబడిన వారి నుంచి రూ.2,500 నగదు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తప్పిపోయిన వ్యక్తి కుటుంబం చెంతకు..

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామానికి చెందిన బాదం హరికృష్ణారెడ్డి మానసిక పరిస్థితి బాగాలేక ఏడాది క్రితం ఇంటి నుంచి వెళ్లగా తిరిగి రాలేదు. ఆయన కుటుంబీకులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. ఈక్రమంలో హరికృష్ణారెడ్డి విజయవాడ ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో తిరుగుతుండగా ఖమ్మంకు చెందిన అన్నం ఫౌండేసన్ చైర్మన్ శ్రీనివాసరావు గుర్తించారు. దీంతో సోమవారం ఆయనను వైరా తీసుకొచ్చి సీఐ నునావత్ సాగర్, ఎస్సై రామారావు సమక్షాన కుటుంబ సభ్యులకు అప్పగించారు.


హరికృష్ణారెడ్డిని కుటుంబానికి అప్పగిస్తున్న దృశ్యం



● ఆస్కార్ ఎంట్రీ



'జిన్ షిన్ జ్యుషు' అనేది జపనీస్ ఎనర్జీ హీలింగ్ టెక్నిక్. ఒత్తిడి, ఆందోళన తగ్గించడానికి, సుఖ నిద్రకు ఇది సహాయపడుతుందని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ హీలింగ్ అండ్ కేరింగ్ అధ్యయనం తెలియజేసింది. పడుకోవడానికి కొద్దిసేపు ముందు చేతి బొటనవేలు, కాలి బొటనవేలును కొద్ది నిమిషాల పాటు నొక్కాలని ఇది శరీరాన్ని నిద్రకు సిద్ధం చేయడానికి సహాయపడుతుందని చెబుతోంది జిన్ షిన్.

మెరుగైన ఇంటి వైపు

ఈ దేశవాసులకు ఈ దేశమే ఇల్లు. ఇక్కడే ఉండాలి. జీవించాలి. కాని ఈ నేల ప్రతి ఒక్కరికీ నివాసయోగ్యంగా ఉందా? ప్రతి ఒక్కరినీ సమానంగా, గౌరవంగా చూస్తోందా? ఏ మహమ్మారో వస్తే వలస కూలీలను 'మీ ఊరికి పోండి' అని సాటి మనుషులే తరిమికొడితే 'ఇంటి వైపు' నడక సాగుతుందా? మన హైదరాబాదీ దర్శకుడు నీరజ్ ఘెవాన్ తీసిన 'హోమ్‌బౌండ్' ఎన్నో సామాజిక ప్రశ్నలు లేవనెత్తుతోంది. వివక్షలను ప్రశ్నిస్తోంది. భారత దేశం నుంచి ఆస్కార్‌కు ఆఫీషియల్ ఎంట్రీగా ఎంపికైన ఈ సినిమా వివరాలు.

హోమ్‌బౌండ్

మే 21, 2025.

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కనీవినీ ఎరగనట్టుగా స్టాండింగ్ ఒవేషన్ ఇస్తున్నారు ప్రేక్షకులు.

సినిమా అయ్యాక లేచి నిలబడి చప్పట్లు కొడుతున్నారు.

ఒక నిమిషం... రెండు నిమిషాలు... చప్పట్లు ఆగడం లేదు... 9 నిమిషాల పాటు చప్పట్లు మోగుతూనే ఉన్నాయి.

ఆ సినిమాలో నటించిన నటీనటులు, నిర్మాత, దర్శకుడు ఉద్వేగంతో కన్నీరు కారుస్తూ ఒకరిని ఒకరు హత్తుకున్నారు.

బహుశా ఆ చప్పట్ల మోత 'ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా'ను తాకినట్టున్నాయి. 2026లో జరగనున్న 98వ ఆస్కార్ అవార్డ్స్ పోటీకి 'బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' కేటగిరి కోసం ఇండియా నుంచి అఫీషియల్ ఎంట్రీగా ఆ సినిమాను ఎంపిక చేశారు.

పేరు: హోమ్‌బౌండ్.

■ అదే దర్శకుడికి అదే గుర్తింపు

'హోమ్‌బౌండ్' (ఇంటి వైపు) దర్శకుడు నీరజ్ ఘెవాన్. ఇంతకు ముందు ఇతను తీసిన 'మసాన్' సినిమా మన దేశంలోనే కాదు విదేశాల్లో కూడా విపరీతమైన ప్రశంసలు పొందింది. దానికి కారణం ఆ సినిమాలో ఎత్తి చూపించిన వివక్ష, తాత్త్వికత. ఇప్పుడు కూడా అలాంటి వివక్షను, ఆధిపత్యాన్ని దర్శకుడు గొప్ప కళాత్మకంగా, సెన్సిబుల్‌గా చూపించడం వల్లే 'హోమ్‌బౌండ్'కు ఘన జేజేలు దక్కుతున్నాయి. హాలీవుడ్ దిగ్గజం మార్టిన్ స్కార్సెసి ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉండటమే కాదు సినిమా విపరీతంగా నచ్చడంతో పొగడ్తలతో ప్రచారంలోకి తెచ్చాడు. ఆ తర్వాత ఫిల్మ్‌ఫెస్టివల్స్‌లో సినిమాకు ప్రశంసలు మొదలయ్యాయి. కాన్స్ తర్వాత టొరెంటో ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'హోమ్‌బౌండ్' రెండవ స్థానంలో నిలిచింది. 'మసాన్' సినిమా సమయంలో కేన్స్‌లో పాల్గొన్న నీరజ్ తిరిగి ఈ సినిమాతో అదే కేన్స్‌లో సగర్వంగా నిలిచాడు.

నిజ సంఘటన ఆధారంగా...



ఈ సినిమాను నిజ జీవిత సంఘటన ఆధారంగా దర్శకుడు నీరజ్ ఘెవాన్ తీశాడు. 2020లో న్యూయార్క్ టైమ్స్‌లో కశ్మీర్ జర్నలిస్ట్ బషారత్ పీర్ ఒక ఆర్టికల్ రాశాడు. ఒక మిత్రుడి సమాధి పక్కన కూచుని ఉన్న మరో మిత్రుడి ఫొటో వేసి. 'టేకింగ్ అమృత్ హోమ్' అనే ఆ ఆర్టికల్ కోవిడ్ కాలంలో సూరత్ ఫ్యాక్టరీల్లో పని చేస్తున్న ఇద్దరు మిత్రులు ఉత్తర్ ప్రదేశ్‌లోని తమ సొంత ఊరుకు బయలుదేరి ఎలా సర్వం కోల్పోయారో, వారిలో ఒక మిత్రుడు చనిపోతే మరో మిత్రుడు కోవిడ్‌కు భయపడకుండా ఆ శవాన్ని ఎలా ఇంటికి చేర్చాడో బషారత్ ఆ ఆర్టికల్‌లో రాశాడు. అది చదివిన నీరజ్ కోవిడ్ సమయాన్ని నేపథ్యంగా ఉంచుతూనే ఈ దేశంలో వ్యాపించిన సామాజిక దుర్నీతులను ముందు వరుసలో పెట్టి 'హోమ్‌బౌండ్'ను తీశాడు.

■ ఇద్దరు స్నేహితుల కథ

'హోమ్‌బౌండ్' షోయెబ్, చందన్ కుమార్ అనే ఇద్దరు మిత్రుల కథ. వీరిద్దరూ అట్టడుగు ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న యువకులు. చిన్నప్పటి నుంచి వీరు పోలీస్ కానిస్టేబుళ్లు అవ్వాలనుకుంటారు. అందుకై ప్రయత్నిస్తూ నగరంలో అంత వరకూ చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ ఉంటారు. కాని ఒకసారి ఊరు విడిచి నగరానికి చేరుకున్నాక ప్రపంచపు పోకడ, మన దేశంలో వేళ్లూనుకుని ఉన్న వివక్ష వారికి అనుభవంలోకి వస్తుంది. చందన్ దళితుడైన కారణంగా అవమానాలు ఎదుర్కొంటుంటే, షోయెబ్ ముస్లిం కావడం వల్ల వివక్షను ఎదుర్కొంటూ ఉంటాడు. ఈ 'దేశం' అనే 'ఇల్లు' వీరికి 'కొందరికి' ఇస్తున్నట్టుగా మర్యాద, గౌరవం ఇవ్వడం లేదు. 'కానిస్టేబుల్ ఉద్యోగం' వస్తే అన్ని వివక్షలు పోతాయని వీరు అనుకుంటారుగాని అదంతా ఉత్త మాట... కొందరు ఎంత ఎదిగినా కిందకే చూస్తారని కూడా అర్థమవుతుంది. వీరికి పరిచయమైన అమ్మాయి సుధా భారతి అంబేద్కరైట్‌గా సమాజంలో రావలసిన చైతన్యం గురించి మాట్లాడుతుంటుంది. ఈలోపు పులి మీద పిడుగులా లాక్‌డౌన్ వస్తుంది. అక్కడి నుంచి ఆ స్నేహితులిద్దరూ సొంత ఊరికి బయలుదేరడంతో ఆ ప్రయాణం వారిని ఎక్కడికి చేర్చిందనేది కథ. ఇందులో ఇద్దరు స్నేహితులుగా విశాల్ జేత్వా, ఇషాన్ ఖట్టర్ నటించారు. సుధా భారతిగా జాన్వి కపూర్ నటించింది. కరణ్ జొహార్, అదర్ పూనావాలా (కోవీషీల్డ్ తయారీదారు) నిర్మాతలు. సహజమైన పాత్రలు, గాఢమైన సన్నివేశాలు, దర్శకుడు సంధించే ప్రశ్నలు ఈ సినిమా చూశాక ప్రేక్షకులను వెంటాడుతాయని ఇప్పటి వరకూ వస్తున్న రివ్యూలు చెబుతున్నాయి.

ఆస్కార్ నామినేషన్స్‌ను జనవరి 22, 2026న ప్రకటిస్తారు. హోమ్‌బౌండ్ నామినేట్ అవుతుందని ఆశిద్దాం. మరో ఆస్కార్ ఈ సినిమా వల్ల వస్తే అదీ ఘనతే కదా.

నవశక్తి



'ఆశలు ఉండగానే సరిపోదు ఆశయ సాధనకు కృషి చేయాల్సిందే! అప్పుడే సరైన ఫలితాన్ని సాధించగలం అంటోంది 19 ఏళ్ల కాట్రావత్ అంజలి. సెప్టెంబర్ 1 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో జరిగిన ప్రతిష్ఠాత్మకమైన ఆలిండియా తాల్ సైనిక్ క్యాంపులో ఉస్మానియా వర్సిటీ సైఫాబాద్ సైన్స్ కాలేజీ విద్యార్థిని, ఎన్‌సిసి క్యాడెట్ అంజలి ఫైరింగ్ విభాగంలో తన ప్రతిభను చూపింది. పతకాలూ సాధించింది. నవ శక్తికి ప్రతీకగా నిలుస్తున్న మహబూబ్‌నగర్ వాసి అంజలి చెబుతున్న విషయాలు ఆమె మాటల్లోనే..

ఫైర్ ముఖ్యం



"మా నాన్న నర్సింహ లారీ డ్రైవర్. అమ్మ దుర్గ గృహిణి. పుట్టిందీ, పెరిగిందీ మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి. ఓయూ సైఫాబాద్ కాలేజీలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. డిగ్రీతో పాటు ఆ కాలేజీలో ఎన్‌సిసిలో సి-సర్టిఫికెట్ చేస్తున్నాను. ఈ యేడాది ఢిల్లీలో జరిగిన టీఎస్సీ (తాల్ సైనిక్ క్యాంప్)లో పాల్గొనే అవకాశం లభించింది. ఇది జాతీయ స్థాయి ఈవెంట్. ఆర్మీ వింగ్‌కి మాత్రమే అవకాశం ఉండే ఈవెంట్ కూడా. ఐయుసి, ఐజిసి, టీ ఆర్టీ.. ఇలా లాంచింగ్ వరకు దశల వారీగా శిక్షణ తీసుకుంటూ, పోటీలో పాల్గొంటూ, సక్సెస్ సాధిస్తేనే టీఎస్సీకి ఎంపిక కాగలం.

ప్రత్యేక శిక్షణ

నేను పాల్గొన్నది ఫైరింగ్ అప్లికేషన్. దీనికి ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ప్రతిరోజూ చేయాల్సిన వ్యాయామాలు, మోటివేషన్ క్లాసులు, ఫైరింగ్‌లో ఏ మోడ్‌పాయింట్ ఎలా తీసుకోవాలనేది శిక్షణలో భాగం. ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఉండే ట్రైనింగ్‌తో పాటు రేంజ్ సెక్షన్ దగ్గర ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి. భుజ బలానికి ప్రత్యేక వ్యాయామాలు ఉంటాయి. స్పోర్ట్స్ సైకాలజిస్ట్‌ల క్లాసులు ఉంటాయి. మానసికంగా ఒకే విషయంపైన ఏకాగ్రత ఉండేలా శిక్షణ ఇస్తారు. పాయింట్ 22 బోర్ రైఫిల్ బరువు 3-4 కేజీలు ఉంటుంది. దీనిని మోయడమే కాదు, అదే సమయంలో ఫైర్ చేయడానికి చాలా శక్తి కావాలి. ఇందుకోసం బలం పెరిగేలా ఆహార నియమాలు, డిప్స్, పుషప్స్, కోర్‌మజిల్ స్ట్రెంథెనింగ్ .. వంటివి రోజూ సాధన చేస్తూ ఉండాలి.

స్ఫూర్తిని నింపే ఈవెంట్..

జాతీయ స్థాయిలో జరిగే టీఎస్సీలో పాల్గొనడానికి దేశవ్యాప్తంగా ఉన్న 17 డైరెక్టరేట్స్ నుంచి మంచి శిక్షణ తీసుకున్న విద్యార్థులు పాల్గొంటారు. ప్రతి డైరెక్టరేట్ నుంచి 40-50 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారు. ఇందులో మన ప్రాంతం నుంచి నేను పాల్గొనడం చాలా ఆనందాన్నిచ్చింది. జాతీయ స్థాయి శిక్షణ పొందిన విద్యార్థులను కలుసుకోవడం, వారి సంస్కృతి గురించి తెలుసుకోడం, పోటీలో పతకాలు సాధించడమూ చాలా సంతోషాన్నిచ్చింది.

ఆశ .. ఆశయం

చిన్నప్పటి నుంచి పోలీస్ అవ్వాలని, డిఫెన్స్‌లోకి వెళ్లాలనేది నా ఆలోచన. దానికి తగినట్టుగా నాకున్న ఆసక్తిని గమనించి, మా ఎన్సీసీ అసోసియేట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ పల్లటి నరేష్ ఆసక్తి ఉందా అని అడిగారు. నా ఆనందం మాటల్లో చెప్పలేను. నాకు ఇష్టమైన రైఫిల్ ట్రైనింగ్‌లో మిస్ కాకుండా పాల్గొనడం మొదలుపెట్టాను. ఈ ట్రైనింగ్ వల్ల కొన్ని నెలలుగా కాలేజీకి దూరంగా ఉండాల్సి వచ్చింది. క్లాసులు, ల్యాబ్స్ మిస్ అయ్యాను. మా లెక్చరర్స్ సపోర్ట్ ఉండటం మరింత బలాన్నిచ్చింది. ఇప్పుడు ఫైనలియర్ కాబట్టి ట్రైనింగ్ తీసుకుంటున్నాను. స్టేట్ పోలీస్ ట్రైనింగ్‌కి అప్లికేషన్ పెట్టుకున్నాను. సెంట్రల్ డిఫెన్స్‌లో పాల్గొనాలనేది నా ఆశ. అందుకు తగిన ట్రైనింగ్ తీసుకుంటున్నాను" అని ఆనందంగా వివరించింది అంజలి.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) సెప్టెంబర్ 22న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,16,410	1,14,500	1,13,070	1,14,500	1,15,200	1,13,020
బంగారం (22 క్యారెట్లు)	1,08,250	1,06,300	1,03,650	1,06,300	1,05,980	1,03,600
వెండి	1,39,000	1,36,400	1,48,000	1,36,400	1,37,000	1,48,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సేంద్రియ ఉత్పాదకాలపై ఎన్ఐపీహెచ్ఎంలో శిక్షణ

ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంలో ఉపయోగించే అనేక బయో ఉత్పాదకాల (బయో ఇన్‌పుట్స్)ను పొలాల్లోనే తయారు చేసుకొని, పంటలకు వినియోగించుకునే పద్ధతులపై హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని కేంద్ర వ్యవసాయ శాఖకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) 3 రోజుల శిక్షణ ఇవ్వనుంది. అక్టోబర్ 13 నుంచి 15 వరకు జరిగే ఈ శిక్షణను తెలుగు, ఇంగ్లిష్, హిందీలలో బోధిస్తారు. జీవన ఎరువులు, జీవన పురుగుమందులు, ఘన /ద్రవ జీవామృతం, కషాయాలు, ద్రావణాల తయారీతో పాటు మిత్రపురుగులను క్షేత్రస్థాయిలో పెంపొందించుకునే పద్ధతులు నేర్పిస్తారు. 30-40 మందికి అవకాశం. రైతులు, ఎఫ్‌పీవోల సభ్యులు, గ్రామీణ యువతీయువకులు ఈ శిక్షణకు అర్హులు. శిక్షణ రుసుము, వసతి, భోజన ఖర్చులన్నీ కలిపి ఒకరికి రూ. 4,185లు. ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై లోతైన అవగాహన పెంచుకోవాలనుకునే యువతకు ఈ శిక్షణ ఉపయోగకరం.

ఇతర వివరాలకు.. డా. బి. శైలజ - 96667 21672.
Email: dirphmniphm-ap@nic.in

26, 27 తేదీల్లో కిసాన్ మహోత్సవం

ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ ఆవరణలో కిసాన్ మహోత్సవం జరగనుంది. అధునాతన వ్యవసాయ పద్ధతులు, పోకడలపై ఎగ్జిబిషన్, సదస్సులు, చర్చా గోష్ఠులు నిర్వహిస్తారు. 2023, 2024 వార్షిక వ్యవసాయ పురస్కారాలు ప్రదానం చేస్తారు.

ప్రవేశం ఉచితం. ఇతర వివరాలకు.. 70757 51969

అధిక దిగుబడినిచ్చే మిల్కీ మష్రూమ్



భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలికి అనుబంధంగా ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ మష్రూమ్ రీసెర్చ్ అధిక దిగుబడినిచ్చే డీఎంఆర్ మిల్కీ-299 అనే కొత్త పుట్టగొడుగుల రకాన్ని అభివృద్ధి చేసింది. ఈ రకం పుట్టగొడుగులు గది ఉష్ణోగ్రతలో 7 రోజులు, ఫ్రిడ్జ్‌లో 15 రోజుల వరకు నిల్వ ఉంటాయని ఐసీఏఆర్ తెలిపింది. విస్తృతంగా సాగులో ఉన్న డీఎంఆర్‌సి-985 రకంతో పోల్చితే ఇది 14.5% అధిక దిగుబడినిస్తుంది. దేశీ జన్యువనరులతో ఆధునిక బ్రీడింగ్ పద్ధతుల ద్వారా తయారైన ఈ రకం పుట్టగొడుగుల పెంపకం రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఐసీఏఆర్ తెలిపింది. బటన్ మష్రూమ్స్ పెంపకంలో మాదిరిగా నియంత్రిత వాతావరణం కోసం ఖరీదైన ప్రత్యేక మౌలిక సదుపాయాలు దీనికి అవసరం లేదు. స్వల్పఖర్చుతో కూడిన షెడ్లలోనూ 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వరకు పెంచవచ్చని చెబుతున్నారు.

సాగుబడి

ఉత్తర కార్తె: సెప్టెంబర్ 26 వరకు
హస్త కార్తె: 27 నుంచి



సాంప్రదాయ పంటలు పండించే చాలా మంది రైతుల నికరాదాయం ఎకరానికి రూ.20 వేలకు మించటం లేదు. పత్తి, మొక్కజొన్నకు బదులుగా మునగ సాగు చేస్తే సన్న, చిన్నకారు రైతుల నికరాదాయం పెరుగుతుంది. 3 సంవత్సరాలలోపు ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కూడా మునగను సాగు చేసుకోవచ్చు. వాతావరణ ఒడిదుడుకులను తట్టుకోవటానికి మునగ దోహద పడుతుంది. నాటిన 7-8 నెలల్లో తొలి పంట కోతకు వస్తుంది. మూడేళ్లలో వరుసగా కనీసం 5 కార్శి పంటలు తీసుకోవచ్చు. మునగ ఆకుల పొడి, గింజల ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. టి. భరత్, ఉద్యాన శాస్త్రవేత్త బి. శివ, విస్తరణ శాస్త్రవేత్త డా. ఎన్. హేమ శరత్ చంద్ర మునగ సాగుపై అందించిన పూర్తి వివరాలు.

మునగ మేలు!







- మునగ ఒక్కసారి నాటితే మూడేళ్ల పాటు మునగ కాయల దిగుబడి
- ఎకరానికి వెయ్యి మొక్కలు.. మొక్కకు 150 కాయలు..
- మునగాకు, గింజల ద్వారా అదనపు ఆదాయం
- ఏడాదికి ఎకరానికి రూ.75 వేల ఆదాయం వస్తుందంటున్న శాస్త్రవేత్తలు

పోషకాల గనిగా పేరు తెచ్చుకున్న మునగ రైతుల పాలిట కల్పవృక్షంగా విరాజిల్లుతున్నది. తినే వారికి ఆరోగ్యం, పండించే వారికి లాభాలు అందిస్తోంది. తక్కువ పెట్టుబడితోనే అధిక దిగుబడులందిస్తూ.. అన్నదాతల ఇంట సిరులు కురిపిస్తున్నది. మునగ చెట్టులో ప్రతీ భాగం ఉపయోగకరమైనదే. ఆకులు, కాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటి విత్తనాలను ఔషధ పరిశ్రమలలో వాడతారు. అందుకే, వీటికి మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉంటుంది. ఆరోగ్యపరంగానే కాకుండా, వ్యాపారపరంగానూ మునగను సాగు చేసేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

ఏ నేలలైనా ఓకే

అన్ని రకాల నేలల్లో మునగను సాగు చేసుకోవచ్చు. ఉదజని సూచిక 6.5-8 శాతం ఉండే ఇసుక రేగడి నేలలు ఎక్కువ అనుకూలంగా ఉంటాయి. నీరు నిలవని ఎర్ర, ఇసుక, ఒండ్రు నేలలు అనుకూలమైనవి. నీటి వసతి గల సారవంతమైన భూముల్లో అధిక దిగుబడి సాధించవచ్చు. ఆరు నెలల్లోనే కాతకు వచ్చే ఏకవార్షిక రకాలు అందుబాటులోకి వచ్చాయి.

అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు

మునగ విత్తనంతో మొక్కలు పెంచి, నాటుకోవాలి. జూలై నుంచి అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు. ఏ సమయంలో విత్తినా వేసవిలోనే (జనవరి-ఏప్రిల్ మధ్యలో) పూతకు వస్తుంది. ఫిబ్రవరిలో ఎక్కువ పూత, కాత ఉంటుంది. ఒక ఎకరానికి వెయ్యి మొక్కలు నాటాలి. మొక్కలను ముందుగా నర్సరీల్లో పెంచాలి. పీకేఎం-1 మునగ రకం విత్తుకోవటం మేలు. పాలిథిన్ సంచుల్లో విత్తిన 15 రోజుల్లో మొలక వస్తుంది. మొక్కల మధ్య 1 మీ., వరుసల మధ్య 1.5 మీ. దూరంలో గుంతలు తీసుకోవాలి. అర ట్రక్కు పశువుల ఎరువుకు రెండు బస్తాల వేపపిండి, 10 కేజీల ట్రైకోడెర్మా కలపాలి. దీన్ని ప్రతి గుంతకు రెండు దోసెళ్లు (ఒక కిలో), గుప్పెడు సూపర్ ఫాస్ఫేట్ వేయాలి. ప్రతి మొక్కకూ డ్రిప్ ద్వారా 135: 23: 45 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను అందిస్తే దిగుబడులు పెరుగుతాయి. నత్రజని, పొటాష్ ఎరువులను యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో డ్రిప్ ద్వారా అందించాలి. డ్రిప్ ద్వారా 10-15 లీ. నీరివ్వాలి. నాటిన తర్వాత 3, 6 నెలలకు నత్రజని ఎరువు వేయాలి. వాస్తవానికి మునగ మొక్కలకు ఎక్కువ ఎరువులు అవసరం ఉండదు. జీవన ఎరువులు కూడా వాడితే నేల సారం, నేల ఆరోగ్యం పెరిగి తెగుళ్ళు రాకుండా ఉంటాయి.



బొంత పురుగులతో జాగ్రత్త

మునగ కాండంపై బొంత పురుగులు గుంపులుగా చేరి, బెరడును తొలిచి తింటాయి. ఆకులను తొలిచేస్తాయి. దీంతో ఆకు విపరీతంగా రాలిపోతుంది. ఈ సమయంలో పురుగు గుడ్లను, లార్వాలను ఏరివేయాలి. వర్షాల తర్వాత పెద్ద పురుగులను నివారించడానికి హెక్టారుకు ఒక దీపపు ఎరను ఉంచాలి. వేపనూనె మందు ద్రావణం పిచికారీ చేస్తే మొక్కలపై పురుగులకు వికర్షకాలుగా పనిచేస్తాయి.

ఈ పంటలతో మునగను కలపొద్దు

ఆయిల్ పామ్, పత్తి, కూరగాయ పంటల్లో అంతర పంటగా వేస్తే మునగ మొక్కలు ఎరువులు, నీరు ఎక్కువగా అంది చాలా ఏపుగా పెరుగుతాయి. కానీ, పూలు, కాయలు ఆలస్యంగా రావడం స్పష్టంగా గుర్తించాం. కాబట్టి, అంతర పంటగా వేసినప్పుడు మునగ మొక్కలకు ఎక్కువ నీరు, ఎరువులు అందకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ చీడపీడలు ఆశించే టమాటా, వంగ, మిర్చి పంటలను మునగలో అంతర పంటలుగా వేసుకోకూడదు. ఎరువులు, సస్యరక్షణ చర్యలు తక్కువ అవసరమయ్యే కూరగాయ పంటలను మాత్రమే వేసుకోవాలి. లేకపోతే మునగ దిగుబడి తగ్గిపోతుంది. పొలంలో మురుగు నీరు చేరకుండా చూసుకోవాలి.

కత్తిరించిన 4-5 నెలల్లో మళ్లీ కాపు

మునగ నాటిన మొదట్లో ప్రతి 2 నెలలకోసారి (6 నెలల్లో 3 సార్లు) విధిగా కొమ్మలు కత్తిరిస్తే.. కొమ్మలు గుబురుగా వచ్చి పూత, కాయల దిగుబడి ఎక్కువగా వస్తుంది. పక్క కొమ్మలు రాకుండా ఏపుగా బాగా ఎత్తు పెరిగితే పూత సరిగ్గా రాదు. భారీ వర్షాలు, ఈదురు గాలులకు మొక్కలు పక్కకు పడిపోయి విరిగిపోతాయి. మొదటి కాయ కోత తర్వాత భూమట్టం నుంచి 90 సెం.మీ. ఎత్తులో మొక్క కాండం, కొమ్మలను కత్తిరించాలి. దీంతో 4-5 నెలల్లో చెట్టు మళ్లీ కాపు కొస్తుంది. మూడు సంవత్సరాల వరకు ఇలా 4-5 నెలలకొకసారి కార్శి పంటలను తీసుకోవచ్చు. కత్తిరించిన వెంటనే మొక్కకు 45, 15,30గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. 30 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. ఏటా 25 కిలోల చొప్పున బాగా చివికిన పశువుల ఎరువు వేయాలి.

ఎకరానికి ఉత్పాదకాల ఖర్చెంత?

కావలసినవి	ఖర్చు (రూ.)
1 కేజీ విత్తనం	2,000
1,000 పాలిథీన్ సంచులు	1,294
నగం ట్రాక్టర్ ట్రక్కు మట్టి, ఇసుక	600
ఒక ట్రాక్టర్ ట్రక్కు పశువుల ఎరువు	2,500
100 కేజీల వేప పిండి	1,500
6 కేజీల ట్రైకోడెర్మా జీవన ఎరువు	600
4 లీటర్ల వేప నూనె	2,400
40 కేజీల జిప్సం	400
4 బస్తాల యూరియా	1,070
2 బస్తాల పొటాష్	3,000
5 బస్తాల సూపర్ ఫాస్ఫేట్	1,810
అర లీటరు రీజెంట్	400
దీపపు ఎరలు	300
సాగు ఖర్చు (కౌలు/దుక్కి/కూలి మినహా)	17,874

మొక్కకు 150 కాయలు

ఒక ఎకరానికి 1,000 మొక్కలు నాటితే ప్రతి మొక్కకు కనీసం 150 కాయల చొప్పున 1,50,000 కాయలు కాస్తాయి. రూపాయికి 2 కాయల చొప్పున (ఒక కేజీకి రూ.5) స్థానికంగా అమ్మితే.. ఎకరానికి ఏడాదికి రూ.75,000 ఆదాయం వస్తుంది. మునగ ఆకులను కోసి ఎండ బెట్టి పొడి చేసి అమ్మొచ్చు. మునగ గింజలు/నూనె ద్వారా అదనపు ఆదాయం వస్తుంది.

మునగ ప్రకృతి సేద్యం ఇలా..

మునగ పంటను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే ఖర్చులు తగ్గి, నేల ఆరోగ్యం మెరుగుపడి, మంచి దిగుబడులు వస్తాయి. ప్రకృతి వ్యవసాయ పద్ధతి మునగ సాగుకు బాగా అనుకూలం. భూమిని లోతుగా దున్ని సూర్య కాంతికి ఎండబెట్టాలి. గోతులు తవ్వి, ఎండిన ఆకుల చెత్త, పశువుల ఎరువు, ఘనజీవామృతం లేదా వర్మీ కంపోస్ట్ కలిపి గోతులను నింపాలి. సేంద్రియంగా సాగు చేసిన విత్తనాలను మాత్రమే వాడాలి. విత్తనాలను బీజామృతంలో శుద్ధి చేసిన 24 గంటల తర్వాత విత్తాలి. మొక్కలకు జీవామృతం లేదా గోమూత్ర ద్రావణం వాడాలి. ద్రవ జీవామృతాన్ని 15 రోజులకు ఒకసారి ఇస్తూ ఉండాలి. డ్రిప్ ద్వారా నీరివ్వాలి. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వేపనూనె, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి కషాయాలను తయారు చేసి పిచికారీ చేయాలి. పచ్చి రొట్ట పంటలను పెంచి, కత్తిరించి, మొక్కల మొదళ్ల చుట్టూ మల్చింగ్‌గా వెయ్యాలి. కలుపు సమస్య తగ్గుతుంది. ఉత్పత్తి ఖర్చు 30-40% తగ్గుతుంది. ప్రకృతి వ్యవసాయంలో పండించిన మునగ కాయలు రుచిగా, పోషకాలు అధికంగా ఉండి, ఎగుమతులకు అనుకూలంగా ఉంటాయి.

ఇతర వివరాలకు.. డా. టి. భరత్ - 97005 49754